# సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 20 । ఆగస్టు । 2024







వైద్యుల నిరసనలతో హోరెత్తిన నగరం 8లో





ఏయూలో రంధ్రాన్వేషణ

ఏయూలో రంధ్రాన్వేషణకు అధికారులు శ్రీకారం చుట్టారు. రాజకీయ ప్రేరేపిత ఆరోపణలపై విచారణకు సిద్ధమవుతున్నారు. 8లో




రాఖీలు, జరభరా పువ్వులతో భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ

## న్యూస్‌రీల్

### సుప్రీంకోర్టు న్యాయమూర్తికి ఘనంగా వీడ్కోలు



న్యాయమూర్తి మహేశ్వరితో న్యాయవాదులు

**విశాఖ లీగల్:** నాలుగు రోజుల పర్యటనను ముగించుకుని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి సోమవారం ఇక్కడ నుంచి ఢిల్లీ బయలుదేరారు. విమానాశ్రయంలో విశాఖ జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవరా సత్యనారాయణ, న్యాయవాదుల సంఘం కార్యదర్శి డి.నరేష్, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, నర్సింగరావు, కె.రామజోగేశ్వరరావు, వరుణ్, కుమార్ ఆయనకు వీడ్కోలు పలికారు. విశాఖ అందాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని, ఇక్కడ వాతావరణం, ప్రజలు చూపించిన ఆప్యాయతను ఎన్నటికీ మరువలేనని జస్టిస్ మహేశ్వరి తెలిపారు. అధికారులు, న్యాయవాదులు, న్యాయమూర్తులకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు.

### 26 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

**మహారాణిపేట:** పోర్టు స్టేడియంలో ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆర్మీ, జిల్లా అధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/ స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్‌లో నియామకాలకు జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ర్యాలీకి 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన యువత హాజరవుతారని.. వారికి అసౌకర్యం లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. స్టేడియం వద్ద తాగునీరు, పారిశుధ్యం, లైటింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టం, మొబైల్ టాయిలెట్లు, డస్ట్‌బిన్లు సిద్ధం చేయాలని జీవీఎంసీ అధికారులకు సూచించారు. పటిష్ట బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపు వంటి చర్యలు చేపట్టాలని డీసీపీకి సూచించారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారి మేజర్ శశాంక్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పోలీసు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### డిసెంబర్ 1న వైజాగ్ మారథాన్

**విశాఖ స్పోర్ట్స్:** వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబర్ ఒకటో తేదీన బీచ్‌రోడ్డులో సంధ్యా మెరైన్ వైజాగ్ మారథాన్ జరగనుంది. సోమవారం ఎంపీ శ్రీభరత్ ఈ కార్యక్రమ బ్రోచర్‌ను విడుదల చేశారు. సొసైటీ అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా వారికి అవగాహన, క్యాన్సర్ బాధితులకు సహాయం అందించే ఉద్దేశంతో ఈ పరుగు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21కే, 10కే రన్‌లో విజేతలకు రూ.5 లక్షల ప్రోత్సాహకంగా అందిస్తామన్నారు. ఔత్సాహికులు https://vizagmarathon.run/ వెబ్‌సైట్‌లో వయోభేదం లేకుండా పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహక కమిటీ ప్రతినిధి శ్రీనివాస్ కోరారు.

### నేడు 'గైస్'లో క్యాంపస్ డ్రైవ్

**మురళీనగర్:** కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్)లో మంగళవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. ఆటోలివ్ గ్లోబల్ కంపెనీ డిప్లమో ట్రైనీ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే క్యాంపస్ డ్రైవ్‌కు 2022, 2023, 2024లో మెకానికల్, ఎలక్ట్రికల్, ఆటోమొబైల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో పాలిటెక్నిక్ డిప్లమో చేసిన వారు అర్హులన్నారు. ఎంపికైనవారు చెన్నైలోని కాంచీపురంలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని, రూ.2.36 లక్షల వార్షిక ప్యాకేజీ అందజేస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 9.30 నుంచి జరిగే ఇంటర్వ్యూలకు అన్ని ధ్రువీకరణపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

### మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) కోర్సులో ప్రవేశాలు

**మహారాణిపేట:** జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ శిక్షణ కేంద్రాల్లో మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్(ఫిమేల్) కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పి.జగదీశ్వరరావు ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి వచ్చే నెల 30లోగా దరఖాస్తులు సమర్పించాలి. పూర్తి వివరాల కోసం https://cfw.ap.nic.in/ను సందర్శించాలని డీఎంహెచ్‌వో సూచించారు.

# చిన్న కొండపై కన్నేశారు




**చిన్న కొండపై పెద్దలు కన్నేశారు. మైనింగ్ పేరుతో ఇష్టానుసారంగా తవ్వేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ చిన్నకొండ(ఎద్దు మెట్ట) నుంచి క్వార్ట్‌జైట్, గ్రావెల్, రఫ్‌స్టోన్ తవ్వితీసి కోట్లుకొల్లగొట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో నాటకాలకు తెరలేపారు.**

- కోట్లు దండుకునేందుకు కూటమి నేతలు యత్నం
- ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో నాటకం
- గాలి, నీరు కలుషితమవుతాయని గ్రామస్తుల ఆందోళన

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఆనందపురం మండలంలోని కుసులవాడ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 104లో 7.991 హెక్టార్ల విస్తీర్ణంలో చిన్నకొండ(ఎద్దు మెట్ట) ఉంది. ఇక్కడ **క్వార్ట్‌జైట్ నిల్వలు ఉన్నాయి. దీనిని ప్రధా**నంగా నిర్మాణ రంగంలో ఎక్కువగా వినియోగిస్తున్నారు. అందువల్ల డిమాండ్ కూడా భారీగా ఉంది. వీటిపై కూటమి నేతల కన్ను పడింది. ఈ నేపథ్యంలో మైనింగ్ లీజును తమకు అనుకూలమైన వ్యక్తులకు ఇవ్వడం కోసం ఈ నెల 28వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణ కోసం రంగం సిద్ధమైంది. తమకు అనుకూలంగా మొత్తం వ్యవహారం నడిపేందుకు పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు తమ గ్రామానికి అండగా ఉన్న ఈ చిన్న కొండను మైనింగ్ పేరుతో తవ్వేస్తే పొలాలతోపాటు గాలి, నీరు కలుషితమై ఇబ్బందులు తప్పవని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఒకవైపు నిలిపివేత.. మరోవైపు..!**

వాస్తవానికి రాష్ట్ర వ్యాప్తంగా మైనింగ్ వ్యవహారాలను కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. ఇప్పటికే ఉన్న మైనింగ్ లీజులకు పర్మిట్లు ఇవ్వకుండా మొత్తం మైనింగ్‌ను రెండు నెలలుగా ఆపేసింది. అయితే కుసులవాడ గ్రామ పరిధిలో కొత్త మైనింగ్ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియను చేపట్టడం ఏమిటనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అనకాపల్లితో పాటు రాంబిల్లి, పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల్లో ఉన్న పలు మైనింగ్ వ్యవహారాలను కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. తమ నేతలకు కూడా వాటాలు ఇస్తేనే కొత్తగా మైనింగ్ ప్రక్రియ చేపట్టేందుకు అనుమతులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే పలు మైనింగ్ యజమాన్యాలు కూటమి నేతలను కలిసి బేరసారాలు కుదుర్చుకున్నట్టు తెలుస్తోంది. ఉన్న మైనింగ్ లీజుల్లో తమ ఆధిపత్యం ఉంచుకోవడంతో పాటు కొత్త మైనింగ్ లీజులు కూడా పక్కాగా తమకే వచ్చేలా కూటమి నేతలు పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నట్టు తెలుస్తోంది.

### ప్రకృతిపై పెద్ద దెబ్బ...!

వాస్తవానికి ఈ ప్రాంతంలో చిన్న కొండ, ఏనుగు కొండ అని రెండు కొండలున్నాయి. ఇప్పటికే ఏనుగు కొండను ఒకవైపు భారీగా తవ్వేస్తున్నారు. ఇప్పుడు ఈ చిన్న కొండ(ఎద్దుమెట్ట)ను కూడా ఇష్టారాజ్యంగా తవ్వేసేందుకు ప్రయత్నిస్తే తమ పంట పొలాలు దెబ్బ తింటాయని రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. అంతేకాకుండా తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి తమను కాపాడే కొండలను కరగదీస్తే ఇబ్బందులు ఎదుర్కొంటామని గ్రామ ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా తాము తాగే నీరు, పీల్చే గాలి కలుషితమై ఆరోగ్యకరమైన సమస్యలు కూడా తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి మైనింగ్ కోసం తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను గ్రామ ప్రజలతో పాటు కమ్యూనిస్టు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికే సీపీఎం ఆధ్వర్యంలో నిరసనలు కూడా కొనసాగుతున్నాయి. మైనింగ్ అనుమతిని వెంటనే వెనక్కి తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేస్తోంది.



స్థానికులతో కలిసి కొండ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మానవ హక్కుల వేదిక ప్రతినిధులు

### ప్రజాభిప్రాయ సేకరణ ఆపాల్సిందే..

కుసులవాడ కొండ మైనింగ్‌కు అనుమతులు మంజూరు చేస్తే నీటి వనరులు పూర్తిగా నాశనమవుతాయి. వ్యవసాయం మరుగున పడే ప్రమాదముంది. హెచ్ఆర్ఎఫ్ తరఫున ప్రతినిధులు కె.అనురాధ, పి.రఘుతో కలిసి ఆ ప్రాంతాల్ని సందర్శించి స్థానిక ప్రజలతో మాట్లాడాం. డ్రాఫ్ట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్(ఈఏఐ) స్థానిక హైడ్రాలజీకి సంబంధించి ఇచ్చిన నివేదిక స్థానిక భాషలో ఉండాలి. కానీ ఇంగ్లిష్‌లో మాత్రమే ఇచ్చారు. ఈ నివేదిక గురించి స్థానికులకు ఎలాంటి అవగాహన లేని కారణంగా తక్షణమే ఈ నెల 28న నిర్వహించాలని భావిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణని రద్దు చేయాలి. ఏదైతే సంస్థకు లీజుకు ఇవ్వాలని చూస్తున్నారో ఆ సంస్థ మైనింగ్ లైసెన్స్ కూడా రద్దు చేయాలి.

– వీఎస్ కృష్ణ, మానవ హక్కుల వేదిక ఉమ్మడి ఏపీ కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడు

### మైనింగ్‌తో చుట్టుపక్కల గ్రామాలకు నష్టం




కుసులవాడలో మైనింగ్‌కు అనుమతులు ఇవ్వడం వల్ల పర్యావరణ విధ్వంసం జరుగుతోంది. చుట్టుపక్కల గ్రామాలకు హాని కలుగుతుంది. ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు ప్రయోజనం చేకూర్చడం కోసం హడావుడి చేస్తుంది. ఒకసారి అనుమతి ఇస్తే 20 ఏళ్ల పాటు గని సాగుతుంది. ఏటా 3 లక్షల టన్నుల గ్రావెల్, రఫ్‌స్టోన్ తవ్వితీస్తారు. 300 లారీలతో వీటిని తరలిస్తారు. ఏటా రూ.2 కోట్ల ఆదాయం చూపించి ప్రభుత్వానికి రూ. కోటి చెల్లిస్తారు. వాస్తవానికి రూ.100 కోట్ల ఆదాయం ఉంటుంది. యంత్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన 15 మందికే అందులో ఉపాధి ఉంటుంది. స్థానికులకు ఉపాధి కూడా లభించదు. అన్ని విధాలా నష్టమే. ఈ నెల 28న జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో మా వాణి వినిపిస్తాం.

– బి.గంగారావు, సీపీఎం ఫ్లోర్ లీడర్, జీవీఎంసీ

## వీరేం పాపం చేశారు..!

- పోలీస్ పదోన్నతుల్లో సవతి తల్లి ప్రేమ
- 1992, 93 బ్యాచ్‌లకు చెందిన 35 మంది కానిస్టేబుళ్ల నిరీక్షణ
- హెడ్‌కానిస్టేబుళ్లుగానే ఉద్యోగ విరమణ
- 1998 బ్యాచ్ వారికి ఏఎస్ఐ ప్రమోషన్లు
- సీనియర్ మహిళా, ఎస్సీ, ఎస్టీ కానిస్టేబుళ్ల పరిస్థితి అంతే..



**విశాఖ సిటీ:** విశాఖ పోలీస్ శాఖలో పదోన్నతుల వ్యవహారం రచ్చ రాజేస్తోంది. **ఉన్నతాధికారులు కొందరిపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారన్న చర్చ జరుగుతోంది.** సీనియర్ల కంటే జూనియర్లకు **పదోన్నతులు** కల్పించడం కమిషనరేట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. 1992 నుంచి 1997 బ్యాచ్‌ల కానిస్టేబుళ్లను పక్కనపెట్టి ఆ తరువాత బ్యాచ్‌కు చెందిన వారికి ప్రమోషన్లు ఇవ్వడంపై పలువురు మనస్తాపం చెందుతున్నారు. ప్రధానంగా పురుష కానిస్టేబుళ్లకే అత్యధికంగా అందలమెక్కించి మహిళా సిబ్బందిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వీరి కంటే జూనియర్లు ఏఎస్ఐలుగా అవుతుంటే.. సీనియర్లు మాత్రం హెడ్‌కానిస్టేబుళ్లుగానే ఉద్యోగ విరమణ పొందుతున్నారు.

**35 మంది నిరీక్షణ :** నగర పోలీస్ శాఖలో 1992 నుంచి 1997 కానిస్టేబుల్ బ్యాచ్‌లకు చెందిన 35 మంది ప్రస్తుతం హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వాస్తవానికి వీరితో పాటు మరికొంత మంది కానిస్టేబుళ్లకు 2012, 2013 ప్రాంతంలో హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోషన్లు లభించాయి. అయితే వీరిలో ఈ 35 మినహా మిగిలిన వారందరూ ఏఎస్ఐలుగా పదోన్నతులు పొందారు. ఎక్కువగా మహిళా హెడ్ కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. అలాగే వారి తరువాత బ్యాచ్‌కు చెందిన వారికి సైతం ఇటీవలే ఏఎస్ఐ ప్రమోషన్లు కల్పించారు. 1992 బ్యాచ్‌కు చెందిన ఎస్టీ, మరికొంత మంది ఎస్సీలకు పదోన్నతుల్లో చోటు కల్పించలేదు. దీంతో జూనియర్లు ఏఎస్ఐలుగా ఉంటే.. సీనియర్లు మాత్రం జూనియర్లకు సెల్యూట్ చేయాల్సిన పరిస్థితులు తలెత్తాయి. మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు సైతం పట్టించుకకపోవడం కమిషనరేట్‌లో చర్చనీయాంశమవుతోంది. 1993 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్ల హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగ విరమణ పొందుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి అందరికీ పదోన్నతులు కల్పించాలని కోరుతున్నారు.

# శిశు విక్రయాల ముఠా గుట్టు రట్టు

- ఒక్క ఫిర్యాదుతో ఆరుగురు చిన్నారులను రక్షించిన ప్రత్యేక బృందం
- ఆంధ్రా, ఒడిశా, తెలంగాణ, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో ముఠా కార్యకలాపాలు
- ఇప్పటి వరకు 17 మంది అరెస్ట్
- 15 మందిని ఇప్పటికే విక్రయించినట్లు గుర్తింపు
- దర్యాప్తు కొనసాగుతోందన్న సీపీ శంఖబ్రత బాగ్చి



వివరాలు వెల్లడిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

**విశాఖ సిటీ:** ఒక్క ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన విశాఖ పోలీసులు.. భారీ శిశు విక్రయాల రాకెట్‌ను ఛేదించారు. చిన్న పిల్లలకు విక్రయించే అంతర్రాష్ట్ర ముఠా బండారాన్ని బట్టబయలు చేశారు. దేశ వ్యాప్తంగా పసి పిల్లలను విక్రయిస్తున్న 17 మంది నిందితులను అరెస్టు చేశారు. వీరు ఇప్పటి వరకు 15 మందిని విక్రయించినట్లు గుర్తించగా.. అందులో ఆరుగురు చిన్నారులను ప్రత్యేక బృందం రక్షించింది. మిగిలిన పిల్లల కోసం విచారిస్తున్నారు. ఈ వ్యవహారంలో మరింత మంది ప్రమేయం ఉన్నట్లు విచారణలో వెల్లడైందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. పోలీస్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శిశు విక్రయాల కేసు రాకెట్‌ను ఛేదించడంలో టాస్క్‌ఫోర్స్ కీలక పాత్ర పోషించని సిబ్బందిని అభినందించారు. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు జరుగుతోందని, త్వరలోనే ఢిల్లీ, ఇతర ప్రాంతాలకు ప్రత్యేక బృందాలు వెళ్లనున్నట్లు చెప్పారు.

**పోలీసుల మాస్టర్ ప్లాన్**

కంచరపాలెం ప్రాంతానికి చెందిన బాలిక ప్రసవించిన శిశువును హార్బర్ పార్క్ వద్ద విక్రయిస్తుండగా.. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు వచ్చిన సమాచారంతో ఇద్దరిని పట్టుకున్నారు. వారిని విచారించగా ఈ విక్రయాల్లో అంతర్రాష్ట్ర ముఠా హస్తం ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ ముఠాను పట్టుకోడానికి టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాస్టర్ ప్లాన్ వేశారు. ఓ పోలీస్ అధికారి క్లైంట్ తరహాలో ముఠా సభ్యులకు ఫోన్ చేసి శిశువు కావాలని అడిగాడు. ఇందుకోసం రూ.5 లక్షల వరకు ఇస్తానని చెప్పాడు. దీనిపై ముఠా సభ్యులు ఓ ప్రాంతానికి రమ్మని చెప్పారు. ఆ అధికారి అక్కడకు వెళ్లినప్పటికీ గ్యాంగ్ అక్కడకు రాలేదు. ఫోన్‌లోనే ప్రాంతాలను మారుస్తూ వచ్చారు. వారు చెప్పిన ప్రకారం అన్ని చోట్లకు వెళ్లారు. చివరకు నగర శివారు ప్రాంతంలో పోలీసులు ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత ఫోన్ చేసిన వ్యక్తిని కలిశారు. వారికి సమీపంలోనే అప్పటికే కాపు కాసి ఉన్న పోలీసులు వారిని పట్టుకున్నారు. వారిని విచారించగా.. దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఈ గ్యాంగ్ చిన్న పిల్లలను విక్రయిస్తున్నట్లు గుర్తించారు.

### ప్రత్యేక బృందాలతో దర్యాప్తు

నిందితుల నుంచి వచ్చిన సమాచారం మేరకు నగరంలో పసిపిల్లల విక్రయాల ముఠా తిరుగుతోందని నిర్ధారణకు వచ్చారు. సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అందులో ఒక బృందం గాజువాకకు చెందిన ఓ వ్యక్తిపై నిఘా పెట్టింది. నగరం నుంచి వెళ్లిపోతున్న అతడిని చాకచక్యంగా నక్కపల్లి వద్ద పట్టుకుంది. అతడిని విచారించగా విజయవాడకు చెందిన ఒక మహిళ, ఢిల్లీకి చెందిన వ్యక్తి నుంచి చిన్న పిల్లలను కొనుగోలు చేసి గాజువాకలో శ్రీనగర్ ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి, మరికొంత మంది ద్వారా విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. వారిపై నిఘా పెట్టి అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 15 నెలల పాపతో పాటు ముఠా సభ్యులను పట్టుకున్నారు. మరింత దర్యాప్తు చేయగా కడపకు చెందిన ఇద్దరు, ఢిల్లీకి చెందిన ఒక వ్యక్తి.. మరో అమ్మాయి ద్వారా విశాఖ, అనకాపల్లితో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో పిల్లలను విక్రయిస్తున్నట్లు తెలుసుకున్నారు. దీంతో పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి అనకాపల్లి జిల్లాలోని మార్టూరు గ్రామం నుంచి 10 నెలల బాబుని, చీమలాపల్లి నుంచి మూడేళ్ల పాపను, విశాఖలోని నరవ నుంచి 20 రోజుల పాపను, ఒడిశాలోని జైపూర్ నుంచి 9 నెలల బాబుని రక్షించారు. ఈ ప్రత్యేక బృందాలు ఇప్పటి వరకు 17 మంది నిందితులను అరెస్టు చేసి ఆరుగురు పిల్లలను సురక్షితంగా విశాఖకు తీసుకువచ్చారు.

### రూ.7 లక్షల వరకు విక్రయాలు

ఆంధ్రా, తెలంగాణ, ఒడిశా, ఢిల్లీతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఈ ముఠా కార్యకలాపాలు సాగిస్తున్నట్లు పోలీసులు విచారణలో నిర్ధారణ అయింది. నిందితుల్లో అత్యధికులు ఆస్పత్రుల్లో పనిచేయడంతో అక్కడ ప్రసవించే వారి నుంచి పిల్లలను కొనుగోలు చేస్తున్నట్లు తెలుసుకున్నారు. వీరు ఎక్కువగా మైనర్లు, అక్రమ సంబంధాలు, ఆడ పిల్ల అంటే ఇష్టం లేని, ఆరోగ్య సమస్యలతో పుట్టిన, పేదరికం వంటి కారణాలు ఉన్న తల్లిదండ్రులను గుర్తించి రూ.2 లక్షలకు పిల్లలను కొనుగోలు చేస్తున్నారు. పిల్లలు కావాలనుకుంటున్న వారికి రూ.5 లక్షలు నుంచి రూ.7 లక్షలు విక్రయిస్తున్నారు. ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, మరిన్ని బృందాలను దేశంలో మరికొన్ని రాష్ట్రాలకు పంపిస్తున్నట్లు సీపీ శంఖబ్రత బాగ్చి చెప్పారు. నగరంలో నవజాతి శిశు సంరక్షణ, ప్రసూతి కేంద్రాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు లేఖ రాసినట్లు చెప్పారు. లోపాలు గుర్తించిన కేంద్రాలకు నోటీసులు కూడా జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జాయింట్ సీపీ ఫకీరప్ప పాల్గొన్నారు.

## విషాహారంతో విషాదం

# పాపం పసివారు!

- ఆశ్రమ నిర్వాహకుల నిర్లక్ష్యంతో ముగ్గురు చిన్నారుల మృతి
- ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న మరో 35 మంది
- ఫంక్షన్లో మిగిలిపోయిన బిర్యానీ పెట్టడమే కారణం
- అస్వస్థతకు గురైనా.. స్పందించని ట్రస్ట్ నిర్వాహకుడు
- కారణం చెప్పకుండా ఇళ్లకు పంపించేయడంతో దారుణం



నర్సీపట్నం ఆస్పత్రిలో చిన్నారులకు చికిత్స





కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులు



బాలికను ఎత్తుకొని కేజీహెచ్‌లో వార్డుకు చేరుస్తున్న సిబ్బంది



చిన్నారులను కేజీహెచ్‌లోకి దగ్గరుండి తరలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

**కోటవురట్ల/నర్సీపట్నం/మహారాణిపేట :** ఆశ్రమ నిర్వాహకుల నిర్లక్ష్యం ముగ్గురు చిన్నారుల ప్రాణాల్ని బలి తీసుకుంది. వారి తల్లిదండ్రులకు తీరని గర్భశోకాన్ని మిగిల్చింది. ఓ ఫంక్షన్లో మిగిలిపోయిన బిర్యానీని పెట్టడం వల్లే పిల్లలు అస్వస్థతకు గురైనట్లు తెలిసినా నిర్వాహకులకు పట్టలేదు. కనీస బాధ్యత లేకుండా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న పిల్లల్ని తల్లిదండ్రులకు అప్పగించి చేతులు దులిపేసుకోవాలనుకున్నారు. ఈ నిర్లిప్తతే ముగ్గురి ప్రాణాల్ని పొట్టన బెట్టుకుంది. ఉమ్మడి విశాఖలో కలకలం రేపిన ఈ విషాదకర ఘటన అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో సోమవారం జరిగింది. వివరాలివి.. పాస్టర్ ఎం.కిరణ్‌కుమార్ పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన (పాసా) చర్చిని 13 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. పాసా ట్రస్ట్ పేరిట ఎలాంటి అనుమతుల్లేకుండా ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా

– మిగతా 8లో

# అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

**మహారాణిపేట:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీదారులు సంతృప్తిచెందేలా వినతులు పరిష్కరించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. కలెక్టర్‌తో పాటు జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్ కుమార్, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ, పోలీస్ అధికారులు పాల్గొని 142 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో సుదూర ప్రాంతాల నుంచి అర్జీదారులు వస్తారని, వారి నమ్మకాన్ని నిజం చేస్తూ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలన్నారు. అరకొరగా ముగించడం వలన అర్జీలు రీఓపెన్ అవుతున్నాయని, అటువంటి అర్జీలు జిల్లాలో ఏడు శాతం ఉన్నాయన్నారు. ఎస్‌డీసీ టి.సీతారామ్మూర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వర రావు, పీడీ హౌసింగ్ డి.అఖిల, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, డీఈవో ఎల్.చంద్రకళ, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**'జీవీఎంసీ'కి 77 వినతులు**

**డాబాగార్డెన్స్:** జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 77 వినతులు అందాయి. మేయర్ హరి వెంకటకుమారి పలువురు అధికారులతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో జోన్-1 నుంచి రెండు, జోన్-2 నుంచి 10, జోన్-3 నుంచి 27, జోన్-4 నుంచి ఎనిమిది, జోన్-5 నుంచి తొమ్మిది, జోన్-6 నుంచి ఎనిమిది, జోన్-7 నుంచి మూడు, జోన్-8 నుంచి నాలుగు, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 6 ఫిర్యాదులు అందాయి.



ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

**పోలీస్ పీజీఆర్ఎస్‌కు 68 ఫిర్యాదులు**

**విశాఖ సిటీ:** పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 68 ఫిర్యాదులు వచ్చాయి. పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చితో పాటు జాయింట్ సీపీ ఫకీరప్ప, ఇతర ఉన్నతాధికారులు ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

# వాణిజ్య సముదాయాల్లో సేఫ్టీ తప్పనిసరి

- జీవీఎంసీ ఫైర్ అధికారులను ఆదేశించిన కమిషనర్ సంపత్‌కుమార్
- సిల్వర్ స్పూన్ లీజు వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

**సాక్షి, విశాఖపట్నం :** మహా విశాఖ నగర పరిధిలో ఉన్న ప్రతి హోటల్, రెస్టారెంట్, గేమింగ్ జోన్, హాస్పిటల్స్, వ్యాపార, వాణిజ్య సముదాయాల్లోనూ ఫైర్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందేనని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఇటీవల నగరంలో వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలపై 'సాక్షి' లో 'ఫైర్ సేఫ్టీపై పట్టింపేదీ?' శీర్షికతో సోమవారం ప్రచురితమైన కథనంపై కమిషనర్ స్పందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న కమిషనర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా జీవీఎంసీ ఫైర్ సేఫ్టీ అధికారులతో మాట్లాడారు. నగర పరిధిలో ఉన్న కమర్షియల్ ఎస్టాబ్లెష్‌మెంట్స్‌కు చాలా వాటికి ఎన్‌వోసీ లేదని తెలుస్తోందన్నారు. ప్రస్తుతం జీవీఎంసీ పరిధిలో ఉన్న ప్రతి ఎస్టాబ్లిష్‌మెంట్‌ని తనిఖీ చేయాలని ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులను ఆదేశించారు. సిబ్బంది తక్కువగా ఉన్నారని ఫైర్ అధికారులు చెప్పగా.. క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేసి 15 రోజుల్లోగా ఎన్‌వోసీలకు సంబంధించిన నివేదిక సిద్ధం చేయాలన్నారు. ఏఏ వాణిజ్య సముదాయాలకు ఎన్‌వోసీలు లేవో.. వాటి కార్యకలాపాలు నిలిపివేసేందుకు మెమో జారీ చేయాలనీ.. అప్పటికీ రక్షణ చర్యలు చేపట్టకపోతే సీజ్ చేసేందుకు వెనకాడొద్దని కమిషనర్ స్పష్టం చేశారు. ఆదేవిధంగా జీవీఎంసీ రెవిన్యూ అధికారులతో మాట్లాడిన కమిషనర్.. అగ్ని ప్రమాదం జరిగిన సిల్వర్ స్పూన్ రెస్టారెంట్‌కు సంబంధించిన లీజ్ ఫైల్ తనకు పంపించాలని ఆదేశించారు. ఎంత స్థలం లీజుకు తీసుకున్నారు.. ఎంత మేర వినియోగించుకుంటున్నారన్న విషయాలపైనా కమిషనర్ ఆరా తీశారు.

# రక్షాబంధం


కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ


తమ్ముడికి రాఖీ కడుతున్న నగర మేయర్ హరి వెంకటకుమారి

**మహారాణిపేట/ఆరిలోవ/తగరపువలస:** జిల్లాలో రక్షా బంధన్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పెదగదిలిలోని తన నివాసంలో తన తమ్ముడు డాక్టర్ భార్గవ్ దినేష్‌కు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్‌కు బ్రహ్మకుమారీలతో పాటు భీమిలి అనాథ ఆశ్రమం చిన్నారులు రాఖీలు కట్టారు. భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబను ఆలయ కమిటీ ప్రతినిధులు రాఖీలు, జరభరా పువ్వులతో విశేషంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## ఫొటో ప్రదర్శన ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏడీసీ శ్రీనివాసరావు

**బీచ్‌రోడ్డు:** బీచ్‌రోడ్‌లోని విశాఖ మ్యూజియంలో వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రెండు రోజుల ఫొటో ప్రదర్శన సోమవారం ప్రారంభమైంది. వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. ఏటా ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జీవీఎంసీ తరఫున ఫొటో జర్నలిస్టులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. అరుదైన ఫొటోలను ఇక్కడ ప్రదర్శించారని, విశాఖ వాసులు తప్పకుండా తిలకించాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఎన్.మూర్తి మాట్లాడుతూ గతేడాది ఆగస్టు నుంచి నేటి వరకు తీసిన అరుదైన చిత్రాలను ప్రదర్శనలో ఉంచామని, మంగళవారం కూడా ప్రదర్శన కొనసాగుతుందన్నారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు ప్రదర్శనలోని ఫొటోలను ఉత్సాహంగా తిలకించారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ కార్యదర్శి జి.తిరుపతిరావు, సీనియర్ ఫొటో జర్నలిస్ట్ పి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగు పడి కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

- మరో కార్మికుడికి గాయాలు


పెంటయ్య మృతదేహం

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ రహదారిలో పిడుగు పడి కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందగా.. మరో కార్మికుడికి గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. స్టీల్‌ప్లాంట్ టీపీపీ విభాగంలో కాంట్రాక్ట్ పనులు నిర్వహిస్తున్న సి.కె.ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో గంగవరానికి చెందిన వాకాడ పెంటయ్య(35), ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజారామ్ పటేల్ కాంట్రాక్ట్ కార్మికులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం విధులకు హాజరైన వీరిద్దరూ మొబైల్ సిమ్ మార్చుకునేందుకు బైక్‌పై కూర్మన్నపాలెం బయలుదేరారు. సీఐఎస్ఎఫ్ యూనిట్ కాంప్లెక్స్ కూడలి సమీపంలోకి వచ్చేసరికి ఉరుములు, మెరుపులతో వర్షం మొదలైంది. దీంతో వారు బైక్ దిగి ఓ చెట్టు కింద తలదాచుకున్నారు. కొద్దిసేపటికి పిడుగు ఒక్కసారిగా వారు తలదాచుకున్న చెట్టుపై పడింది. అనంతరం పెంటయ్యపై పడగా అతను అక్కడికక్కడే కూలిపోయాడు. పక్కనే ఉన్న రాజారామ్ పటేల్ ఆ శబ్దానికి కింద పడ్డాడు. ఈ ఘటనలో పెంటయ్య అక్కడే మృతి చెందగా.. రాజారామ్ పటేల్ గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్ఐ తాతారావు సిబ్బందితో అక్కడికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. పటేల్‌ను చికిత్స నిమిత్తం ఉక్కు జనరల్ ఆస్పత్రిలో చేర్పించారు. పెంటయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్ఐ తాతారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కేజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్యుడిపై విచారణ

**మహారాణిపేట:** కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగం ప్రొఫెసర్‌పై ఆరోపణలు రావడంతో సోమవారం డాక్టర్ వాణి (గైనిక్), డాక్టర్ చక్రవర్తి(చిల్డ్రన్), మన్మథరావు (సర్జన్), ప్రేమజీత్ రే (న్యూరో) విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ అధికారులు, వైద్య విద్యార్థుల నుంచి వివరణ తీసుకున్నారు. నివేదికను త్వరలో సూపరింటెండెంట్ ద్వారా డీఎంఈకి అందజేస్తామన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

UNITED FARMERS CREAMARY
AN ICE CREAM STORE
REQUIRES M/F
* MANAGER
* ASST. MANAGER
* KITCHEN STAFF వంటగది సిబ్బంది
Contact : 9615 222 555
Dwarakanagar, Main Road, VIZAG

# ఏయూలో రంధ్రాన్వేషణ

- రాజకీయ ప్రేరేపిత ఆరోపణలపై విచారణకు శ్రీకారం
- గత నిర్ణయాలు, కాంట్రాక్టులు, నిధుల వినియోగంపై రికార్డుల పరిశీలన
- ఇందుకోసం విభాగాల వారీగా ఆరు ప్రత్యేక కమిటీల ఏర్పాటు
- సభ్యులుగా ఏయూతో పాటు ఇతర వర్సిటీ ప్రొఫెసర్ల నియామకం




**విశాఖ సిటీ:** ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రంధ్రాన్వేషణకు అధికారులు శ్రీకారం చుట్టారు. రాజకీయ ప్రేరేపిత ఆరోపణలపై విచారణకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ పెద్దల రహస్య ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఏయూలో ఎన్నడూ లేని విధంగా గత పాలనలో టీడీపీ నేతలు ఆరోపణలను భూతద్దంలో చూపించే కొత్త రాజకీయాలకు తెరతీశారు. గతంలో తీసుకున్న నిర్ణయాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ, కాంట్రాక్టుల మంజూరు, నిధుల దుర్వినియోగం వంటి వాటిపై విచారణకు ఏయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు ఆదేశాలతో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు ఆరు కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీలో ఏయూ ఆచార్యులతో పాటు ఇతర విశ్వవిద్యాలయాల నుంచి ప్రొఫెసర్లు, నిపుణులను నియమించారు. ఏయూలో పలు విభాగాల్లో గతంలో తీసుకున్న నిర్ణయాలు, ఆమోదం, అమలుపై వచ్చిన ఆరోపణలపై నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు.

**2019 నుంచి 2024 మధ్య విస్తృత అభివృద్ధి**

2019–24 మధ్య ఏయూ విశేష ప్రగతి సాధించిందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ప్రధానంగా నాణ్యమైన విద్యతో పాటు పరిశోధనలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి ఆ–హబ్ సెంటర్, నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఫుడ్ టెస్టింగ్, ఫార్మా ఇంకుబేషన్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల ఉపయుక్తంగా ఉండేలా అల్గారిథం పేరుతో భవనం, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, అంబేడ్కర్ చైర్, మేథో హక్కుల పరిరక్షణ కోసం పనిచేసేలా ఏపీకే నోడల్ సెంటర్‌గా ఇంటలెక్చువల్ ప్రోపర్టీ రైట్స్(ఐపీఆర్) చైర్, ఓపెన్ ఎయిర్ థియేటర్, లైబ్రరీ ఆధునికీకరణ, తాళపత్రాల డిజిటలైజేషన్.. ఇలా అనేక నూతన అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు. ఏయూ చరిత్రలో ఎన్నడూ లేని స్థాయిలో పేటెంట్ హక్కులు వచ్చాయి. ఫలితంగా గతంలో ఎన్నడూ లేనవిధంగా విద్యార్థులకు అత్యధిక వేతనాలతో విపరీతంగా ప్లేస్‌మెంట్స్ లభించాయి. ఏయూలో పరిశోధనాత్మక విద్యాబోధన, సౌకర్యాల కల్పనతో ప్రతిష్టాత్మక నాక్ ఏ++ గ్రేడ్ గుర్తింపు లభించింది.

**ఆరు కమిటీల ఏర్పాటు**

ఆరు విభాగాల్లో జరిగిన కార్యక్రమాలతో పాటు కాంట్రాక్టులు, ఇతర అంశాలపై విచారణకు ఆరు కమిటీలను నియమించారు.

- ఏయూ ట్రాన్స్ డిసిప్లీనరీ రీసెర్చ్ హబ్(ఏయూ టీడీఆర్ హబ్)పై విచారణకు ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో ప్రస్తుతం ఏయూ టీడీఆర్ హబ్ డీన్ ఆచార్య పి.మల్లికార్జునరావు, ప్రొఫెసర్లు వజీర్‌మహ్మద్, పి.సునీత, ఎం.గోపీచంద్ నాయక్, అంబేడ్కర్ వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత, విజయనగరం గురజాడ వర్సిటీ ప్రిన్సిపాల్ కె.శ్రీకుమార్, డైరెక్టర్ కె.చంద్రభూషణ్‌లు సభ్యులుగా ఉన్నారు.
- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌పై విచారణకు ప్రొఫెసర్లు కె.రాంజీ, పి.మల్లికార్జునరావు, జి.ఎం.జె.రాజు, బి.ప్రజ్ఞ, పి.శైలజలను నియమించారు.
- ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూ సిబ్)కు ఎ.నరసింహారావు, పి.సునీత, వజీర్‌మహ్మద్, బి.మునిస్వామి, పి.అనూరాధ కామేశ్వరిలను నియమించారు.
- రూసా ఫేజ్–2 వినియోగంపై పరిశీలనకు ప్రొఫెసర్లు ఆర్.ప్రద్మశ్రీ, జి.గిరిజాశంకర్, కె.శ్రీనివాసరావు, జేఎన్‌టీయూ విజయనగరం డైరెక్టర్ కె.చంద్రభూషణ్‌రావు, ఏయూ ఎఫ్ఓ వి.సూర్యారావులను సభ్యులుగా నియమించారు.
- సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్‌పై విచారణకు ప్రొఫెసర్లు కె.రాంబాబు, వజీర్‌మహ్మద్, బి.మునిస్వామి, ఎం.ఎస్.అనూరాధ, ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత డాక్టర్ సి.హెచ్.అనీల్ కుమార్, జేఎన్‌టీయూ విజయనగరం డైరెక్టర్ కె.చంద్రభూషణరావును సభ్యులుగా నియమించారు.
- ఏయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)పై విచారణకు ప్రొఫెసర్లు ఆర్.పద్మశ్రీ, వజీర్ మహ్మద్, డి.ఎ.నాయుడు, కె.ఈశ్వర్‌కుమార్, జి.నానాజీరావు, నాగార్జున వర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ నుంచి డాక్టర్ టి.ఎ.వి.ప్రసాద్, జేఎన్‌టీయూ విజయనగరం డైరెక్టర్ కె.చంద్రభూషణ్‌రావును నియమించారు.

### టీడీపీ ఆరోపణలపైనే..!

2019 నుంచి టీడీపీ నేతలు ఏయూపై బురద జల్లుతూనే వచ్చారు. ఒకవైపు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చినప్పటికీ ఏయూ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నాలు చేశారు. ప్రస్తుత ప్రజాప్రతినిధి అప్పట్లో ఏయూను దెయ్యాల కొంపగా అభివర్ణిస్తూ తూలనాడినప్పటికీ.. ప్రస్తుత కమిటీలో ఉన్న కొంత మంది ప్రొఫెసర్లు కనీసం నోరు మెదపలేదు. కానీ వారు చేసిన ఆరోపణలపై విచారణకు మాత్రం ముందు వరుసలోకి వచ్చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి ఏయూపై ఆరోపణలను మరింత పెంచారు. ఫలితాలు వెలువడిన వెంటనే ఏయూ వీసీ ఛాంబర్‌పై తెలుగు తమ్ముళ్లు దండెత్తారు. వెంటనే అప్పటి ఏయూ వీసీ ప్రసాదరెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏయూలో అక్రమాలు జరిగాయంటూ వాటన్నింటిపై విచారణ చేయిస్తామని టీడీపీ నేతలు అప్పుడే హెచ్చరించారు. దానికి తగ్గట్టుగానే ప్రస్తుత ఏయూ అధికారులు అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వ పెద్దల రహస్య ఆదేశాలతో గత పాలనలో జరిగిన కార్యక్రమాలపై విచారణకు సిద్ధమయ్యారు.

# వైద్యుల నిరసనలతో హోరెత్తిన నగరం


నల్ల రిబ్బన్లతో రాఖీ కడుతున్న వైద్యులు


ప్లకార్డులతో విద్యార్థుల ప్రదర్శన


నినదిస్తున్న వైద్యురాలు

**సీతమ్మధార:** కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి.. దారుణంగా హత్య చేసిన నిందితులను శిక్షించాలని జూనియర్ వైద్యులు డిమాండ్ చేశారు. మాకు రక్షణ కావాలి.. మాకు న్యాయం జరగాలనే డిమాండ్‌తో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ వైద్యులు మాట్లాడుతూ డాక్టర్ హత్య ఘటనలో కళాశాల ప్రిన్సిపాల్ హస్తం ఉందని ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించి.. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్(సీపీఏ)ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జూడాల ధర్నాకు ఉత్తర ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్ రాజు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారికి నల్ల రిబ్బన్లతో రాఖీ కట్టారు.

**పీడీఎస్‌వో ఆధ్వర్యంలో..**

జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన వారిని వెంటనే శిక్షించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పీడీఎస్‌వో) డిమాండ్ చేసింది. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్ష చేస్తున్న వైద్యులకు సంస్థ సభ్యులు సంఘీభావం తెలిపారు. సంస్థ ప్రతినిధి లక్ష్మి, రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథ్, వి.లక్ష్మి, సభ్యులు నాగసాయి, షణ్ముక్, జానకి పాల్గొన్నారు.

**సాగరతీరంలో కొవ్వొత్తుల ర్యాలీ**

**బీచ్‌రోడ్డు:** స్టాఫ్ నర్సులు సోమవారం సాగరతీరంలో మౌన ప్రదర్శన, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాళీమాత ఆలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ వైఎంసీఏ వరకు సాగింది. ముందుగా ఈ ర్యాలీని ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ప్రారంభించి మాట్లాడారు. మహిళ భద్రత కోసం ఎన్ని చట్టాలు చేసినా.. సమాజంలో మార్పు రావడం లేదన్నారు. ఇటువంటి వారికి బహిరంగంగా శిక్షపడేలా చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## మహిళ హత్య కేసులో వ్యక్తికి యావజ్జీవ జైలు

**విశాఖ లీగల్:** వివాహేతర సంబంధం నేపథ్యంలో మహిళను అత్యంత కిరాతకంగా హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ 13వ అదనపు జిల్లా జడ్జి షణ్ముఖరావు సోమవారం తీర్పు ఇచ్చారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.పావని తెలిపిన వివరాలివీ.. గాజువాకకు చెందిన పి.చిన్నప్పలనాయుడు(53)కి తన ఇంటి సమీపంలో ఉన్న మహిళతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. చిన్న అప్పలనాయుడు మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించడంతోపాటు తరచూ ఆమెను అనుమానించాడు. వేరే వ్యక్తితో ఆమెకు వివాహేతర సంబంధం ఉందని గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో 2013 జూన్‌లో ఆ మహిళపై కత్తి దాడి చేసి హత్య చేశాడు. గాజువాక పోలీసుల నిందితుడుపై కేసు నమోదు చేసి, నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితుడు చనిపోయే వరకు జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో స్పష్టం చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, REDDI SOBHAN BABU (Old Name) S/o R.Appala Murthy (Late), R/o. D.No. 54-12-64/2, Bhanu Nagar, Near Krishna College, H.B.Colony, Visakhapatnam, A.P.- 530022 Changed my Name REDDI SOBHAN BABU (Old Name) to instead of REDDI SOBANA BABU (New Name) for all purpose.

Real Estate

FLAT FOR SALE
■ Luxury 3 Bed Room Flats for sale, Yendada Main Road South 1510 Sq.ft. 2 Road corner. Rate 78 Lakhs including amenities. Ph : 79893 44212 [V- 12501]

PLOT FOR SALE
■ ఎస్.కోట బొద్దాం విలేజికి 1.5 కి।।మీ।। దూరంలో VUDA LP PLOTS అమ్మకానికి కలవు. 100% బ్యాంక్ లోన్‌తో పాటు అదనంగా అమౌంట్ కావాలన్నా చేయగలం. ఫోన్: 79938 88479. [V-2669]
■ VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీగంధం, ఎర్రచందనం మొక్కలతో చ।।గ।। 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్, ఫామ్‌హౌస్ ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర: ✆ 73372 42575 [B-56]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12484]

Wanted
■ Wanted Female EM Subject Teachers for Classes 4th to 7th Std. Maths, Telugu, Social, Science, Hindi, English, P.E.T. (F). Cont : 95811 26947. Old Post Office, 1 Town [V- 823852]
■ Wanted Teachers to Teach Pre Primary, Primary Classes and Receptionist. Cont : Pragati High School, Gajuwaka. Cont : 92466 12865 [V- 786930]
■ వైజాగ్ : ఎండాడ, మధురవాడ ఏరియాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం:13000. వయస్సు : 25 to 55 సం।।లు. రూమ్ ఫ్రీ. ✆ : 97051 56333 / 78421 81184 [R-2187]
■ ప్రముఖ సంస్థలో పని చేయుటకు Male సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం + PF + ESI, ప్రదేశం: Vizag. సంప్ర: ✆ 87126 36579 [B-381]
■ ప్రముఖ ఎయిర్‌పోర్ట్‌లో పనిచేయటానికి కార్గో సూపర్‌వైజర్, కంప్యూటర్ ఆపరేటర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, క్యాబ్ డ్రైవర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 28000 నుంచి 34000 రూము+ భోజనం ఫ్రీ. Ph: 7093769794 [H-778942]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

| | |
|---|---|
| మురళీనగర్, మాధవధార | : 90101 33346 |
| NAD, కంచరపాలెం | : 90108 10033 |
| గోపాలపట్నం, పెందుర్తి | : 70759 89701 |
| సీతమ్మధార, ద్వారకానగర్ | : 90100 55116 |
| డాబాగార్డెన్స్, జగదాంబ MVP కోలనీ, మద్దిలపాలెం | 90101 96663 |
| గాజువాక | : 97059 33394 |

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

# పాపం పసివారు!

7వ పేజీ తరువాయి

పాడేరు, చింతపల్లి, కొయ్యూరు తదితర మండలాలకు చెందిన 86 మంది పిల్లలు ఇక్కడ ఆశ్రయం పొందుతూ, సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. శనివారం మధ్యాహ్నం పందూరు గ్రామంలో లోవరాజు అనే వ్యక్తి ఇంట్లో ఓ కార్యక్రమం జరిగింది. అక్కడ మిగిలిపోయిన వెజ్ బిర్యానీని రాత్రి ఆశ్రమ పిల్లలకు పెట్టారు. దాంతో పాటు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అందించిన సమోసాలను కూడా విద్యార్థులకు అందించారు. వీటిని తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శనివారం రాత్రి (తెల్లవారితే ఆదివారం) 2 గంటల ప్రాంతంలో 6గురు పిల్లలకు వాంతులు, విరేచనాలయ్యాయి. మళ్లీ వేకువజాము 4 గంటల సమయంలో మరో 21 మంది పిల్లలు అస్వస్థతకు గురయ్యారు. వారికి స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ఇళ్లకు పంపించేశారు. ఇళ్లకు వెళ్లినవారిలో కొందరి పరిస్థితి విషమించడంతో పాడేరు, చింతపల్లి, కొయ్యూరు, నర్సీపట్నం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పించారు. కొయ్యూరు మండలం డౌనూరు ఆస్పత్రిలో 18 మందిని చేర్చగా, అందులో పరిస్థితి సీరియస్‌గా ఉన్న నలుగురిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. డౌనూరు ఆస్పత్రిని ఐటీడీఏ పీవో అభిషేక్ సందర్శించి అనారోగ్యానికి గురైన బాలికలతో మాట్లాడారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 15 మంది చేరగా వారిలో ఆరుగురి పరిస్థితి విషమించడంతో వెంటనే విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌కు మొత్తం 14 మందిని తీసుకొచ్చి, చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనలో కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ రెల్లలపాలేనికి గెమ్మెలి నిత్య(భవాని)(8), చింతపల్లి మండలం తిరుమల పంచాయతీ నిమ్మలపాలేనికి చెందిన తంబెలి జాషువా(7), చింతపల్లి మండలం బలభద్రకు చెందిన కొర్రా శ్రద్ధ(7) మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న అనకాపల్లి జేసీ జాహ్నవి సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. ఆశ్రమాన్ని ఎన్నేళ్లుగా నడుపుతున్నారు? అనుమతులపై ఎంఈవో రామారావును ప్రశ్నించారు. అనుమతి లేదని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఇలా అనుమతి లేకుండా ఎన్ని ఆశ్రమాలు ఉన్నాయని ప్రశ్నించారు. ఇదొకటే అని చెప్పడంతో కచ్చితంగా చెప్పగలరా అంటూ ఆగ్రహించారు. విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. నక్కపల్లి సర్కిల్ సీఐ అప్పన్న విచారణ చేపట్టి నిర్వాహకుడు కిరణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆర్డీవో వి.జయరాం, ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు, ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ సంఘటనా స్థలంలో విచారణ జరిపి, వివరాలు సేకరించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, ఉన్నతస్థాయి కమిటీ విచారణకు సీఎం ఆదేశించినట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడించారు.

**నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో..**

విషాహారం తిని అస్వస్థతకు గురైన చింతపల్లి మండలానికి చెందిన పిల్లల్ని వారి తల్లిదండ్రులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. కిటుముల పంచాయతీ సర్పంచ్ గెమ్మిలి రమణమ్మ విద్యార్థుల తల్లిదండ్రులకు అండగా నిలిచారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణిదేవి, వైద్యులు వికాస్, లత, రాజు, సువర్ణ సత్వర వైద్య సేవలు అందించి, మెరుగైన చికిత్సకు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక, జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఆర్డీవో జయరాం ఆస్పత్రిలోనే ఉండి వైద్య సేవల్ని పర్యవేక్షించారు.

**14 మందికి కేజీహెచ్‌లో చికిత్స**

అస్వస్థతకు గురైన 14 మంది పిల్లలను పలు అంబులెన్స్‌లలో కేజీహెచ్ పిల్లల వార్డుకు తీసుకొచ్చారు. వీరికి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ పర్యవేక్షణలో పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఎస్.రవి(8), కె.శశాంక్(8), టి.అలియా(7), ఎం.నవీన్(10), కె.నాగేశ్వరి(12), కె.మీరా(10), టి.గీత(9), జి.జోసెఫ్(7), పి.జెస్సికా(8), పి.అరవింద్(7), పి.జ్యోతి(8), పి.మౌనిక(7), పి.స్వప్న(8), పి.మౌనిక(3)లకు చికిత్స అందుతోంది. వీరిలో పి.జెస్సికా బీపీ డౌన్ అవుతోందని, ప్రస్తుతానికి ఆక్సిజన్ పెట్టినట్లు వైద్యులు తెలిపారు. అస్వస్థతకు గురైన పిల్లలకు కేజీహెచ్‌లో అందుతున్న సేవలను విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్ దగ్గరుండి పర్యవేక్షించారు. పిల్లలతో, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందుతుందని భరోసానిచ్చారు. కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులను రాష్ట్ర హోం మంత్రి వి.అనిత, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ నాయకుడు పి.ఎల్.ఎన్.మాధవ్, రవికుమార్ తదితరులు పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.


కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

**ట్రస్ట్ నిర్వాహకుడు కిరణ్‌కుమార్‌కు రిమాండ్**

**సాక్షి, అనకాపల్లి:** కోటవురట్ల కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన (పాసా) ట్రస్ట్ నడుపుతున్న ట్రస్ట్ నిర్వాహకుడు కిరణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని జిల్లా ఎస్పీ దీపికా పాటిల్ సోమవారం రాత్రి మీడియాకు తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, ఇందులో ఇంకెవరున్నా వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ విచారణలో డొనేషన్ ఇచ్చిన బిర్యానీ ఫుడ్‌ను రాత్రి డిన్నర్‌లో పెట్టడం.. ఫుడ్ పాయిజన్ అయి వాంతులు, విరోచనాలతో గురైన వెంటనే ఆస్పత్రికి పంపించకుండా నిర్వాహకుడు వారి తల్లిదండ్రులకు అప్పగించడం మృత్యువాతకు దారి తీసినట్టు తేలిందన్నారు. అంతేకాకుండా ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండా అనధికారికంగా ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి హాస్టల్‌గా నడుపుతున్నట్లు తేలిందన్నారు. కిరణ్‌కుమార్‌పై పాత సెక్షన్ 304, కొత్త సెక్షన్ 105 కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు. ఇలా ఏజెన్సీ ప్రాంతం నుంచి విద్యార్థులను తీసుకొచ్చి అనధికారింగా ట్రస్టుల పేరిట హాస్టళ్లు ఏర్పాటు చేస్తే అలాంటి వారిపై తక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**బాధిత విద్యార్థులను పరామర్శించిన సీపీ**

**మహారాణిపేట:** కోటవురట్ల మండలం కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో జరిగిన విషాహారం ఘటనకు సంబంధించి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను సోమవారం సీపీ శంఖ బ్రత బాగ్చి పరామర్శించారు. అనధికార ఆశ్రమంలో ఉన్న బాధిత విద్యార్థులు బయట ఫంక్షన్ నుంచి తెచ్చిన ఆహారం తిని అస్వస్థతకు గురవ్వడం బాధాకరమన్నారు. ఇక్కడ చికిత్స పొందుతున్న 14 మంది విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

# పెందుర్తిలో దొంగల హల్‌చల్

- ఏకకాలంలో మూడిళ్లలో చోరీ
- 17 తులాల బంగారు ఆభరణాలు, 1.5 కిలోల వెండి అపహరణ


పెందుర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని చోరీకి గురైన ఇల్లు (ఇన్‌సెట్ ) ఇంటి ప్రధాన ద్వారాన్ని విరగ్గొట్టిన దుండగులు

**పెందుర్తి:** పెందుర్తిలో వరుసగా రెండో రోజు దొంగలు అలజడి రేపారు. రైల్వే స్టేషన్ మార్గంలోని జనచైతన్య లేఅవుట్ గణేష్‌నగర్‌లో ఏకకాలంలో మూడిళ్లను కొల్లగొట్టారు. ఆయా ఇళ్లల్లోని 17 తులాల బంగారు ఆభరణాలు, 1.5 కిలోల వెండి సామగ్రి, రూ.19 వేలు అపహరించుకుపోయారు. వెళుతూవెళుతూ కాలనీలో పార్కు చేసిన రెండు బైక్‌లను కూడా తస్కరించారు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్న పి.శ్రీనివాసరావు (బ్యాంక్ మేనేజర్) కుటుంబంతో కలిసి ఆదివారం సాయంత్రం నగరంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ప్రధాన ద్వారం తెరిచి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లి గమనించగా బీరువా తెరిచి ఉంది. అందులోని 16 తులాల బంగారు ఆభరణాలు, 70 తులాల వెండి సామగ్రి పోయినట్లు గుర్తించారు. ఇదే కాలనీలో నివాసం ఉంటున్న కాసా శ్రీనివాసరావు కుటుంబంతో రెండు రోజుల క్రితం బయటకు వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చేసరికి ఇంట్లోని తులం బంగారం, 750 గ్రాముల వెండి సామగ్రి, రూ.10 వేలు మాయం అయినట్లు గుర్తించారు. ఇదే కాలనీలో మరోచోట ఉంటున్న ఎం.గణేష్ ఆదివారం రాత్రి బయటకు వెళ్లి సోమవారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం విరగ్గొట్టి బీరువాలోని రూ.9 వేలు దొంగతనం చేసినట్టు గుర్తించారు. ఇదే కాలనీలో పార్కింగ్ చేసి రెండు బైక్‌లను కూడా తీసుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు నేర స్థలాలను క్రైం ఏసీపీ శ్యామలరావు, సీఐ శ్రీనివాసరావు, ఇంచార్జి క్రైం ఎస్ఐ సుదర్శన్ సందర్శించి దొంగతనాలు జరిగిన తీరుపై ప్రాథమిక విచారణ చేశారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది.

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
సమీకృత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032
కార్యాలయ చిరునామా:- శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నెం.14-1-1/2బి, 2వ అంతస్తు, మోర్ ఎదురుగా, జోనల్ కార్యాలయం, మహారాణిపేట, విశాఖపట్నం-530002.

స్వాధీనతా ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" గా పిలువబడినది, ఎన్‌సిఎల్‌టి బెంచ్–II చెన్నై, తేది 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేదీనాటి కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డు కంపెనీ అయి ఉన్నాము మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద మా రిజిస్టర్డు ఆఫీసును కలిగి, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) లోని నిబంధనల క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (సదరు రూల్స్)లోని రూల్ 3తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు డిమాండ్ నోటీసులో తెలిపిన మొత్తమును తిరిగి చెల్లించవల్సిందిగా దిగువ పట్టికలోని వివరాలు గల రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులను జారీ చేశారు.
రుణగ్రహీతలు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు క్రింది తెలిపిన ఆస్తిని తేది 16-08-2024 న స్వాధీనపర్చుకున్నారు.

| రుణగ్రహీత పేరు మరియు చిరునామా | డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం |
|---|---|
| (1). నేతల సూర్య నారాయణ, తండ్రి: ఎస్. సత్యం నాయుడు, డోర్ నెం.30-82-1/157, ఎస్.ఆర్. రెసిడెన్సీ, తిరుమల నగర్, వడ్లపూడి గ్రామం పోస్టు, విశాఖపట్నం-530046. (2). నేతల సుజాత, భర్త: ఎస్. సూర్య నారాయణ, డోర్ నెం: 30-82-1/157, శ్రీ రెసిడెన్సీ, తిరుమల నగర్, వడ్లపూడి గ్రామం పోస్టు, విశాఖపట్నం-530046. (3). ముంజేటి కోటిల, భర్త: ఎమ్. కిషోర్ కుమార్, ఫ్లాట్ నెం: 406, అదిత్య [illegible] అపార్ట్‌మెంట్స్, ఫేజ్-6, గ్రీన్ ల్యాండ్స్, దూర్వస్నపాలెం, వాటర్ ట్యాంక్ దగ్గర, వడ్లపూడి, విశాఖపట్నం-530046. | రుణ ఖాతా నెం. NRSP1TF2111280003 రిఫరెన్స్ క్రింద చెల్లించవలసిన మొత్తం బకాయి రూ. 26,42,423 (అక్షరాల ఇరవై ఆరు లక్షల నలభై రెండు వేల నాలుగు వందల ఇరవై మూడు రూపాయలు) డిమాండ్ నోటీసు తేది: 22.03.2024 |

లంకెలపాలెం సబ్-రిజిస్ట్రార్, డాక్యుమెంట్ నెం. 4679/2021 ప్రకారం నేతల సుజాత పేరునగల స్థిరాస్తి వివరములు:
విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్ ఏరియా, లంకెలపాలెం సబ్-జిల్లా, పరవాడ మండలం, దీపురుపల్లి గ్రామ పంచాయతీ, దీపురుపల్లి వెస్ట్ ఖండం, సర్వే నెం.428/3 లోని మొత్తం ఎ. 0.12 సెంట్ల విస్తీర్ణంలో ఎ. 0.09 ½ సెంట్లు లేదా 459.8 చదరపు గజాలు లేదా 386.23 చదరపు మీటర్ల ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: కుంభపు సోము నాయుడు యొక్క మెట్ట భూమి, దక్షిణం: వెంకట్ యొక్క మిగతా భూమి, పడమర: చంద్రపు ముత్యాలు యొక్క మెట్ట భూమి, ఉత్తరం: రోడ్డు.

సాధారణ ప్రజానీకమంతటికీ ఈ నోటీసు ద్వారా కూడా హెచ్చరిక చేయునది ఏమనగా ఇందులో పైన తెలిపిన స్థిరాస్తిపై SFL యొక్క అధీకృత అధికారి చట్టబద్ధ స్వాధీనతను కలిగియున్నారు మరియు ఈ నోటీస్ అందిన తరువాత రుణగ్రహీతలు లేదా ఎవరేని ఇతరులు SFL యొక్క లిఖితపూర్వక ముందస్తు అనుమతి లేకుండా, ఈ నోటీసులో పైన తెలిపిన ఏదేని సెక్యూర్డ్ ఆస్తిని అమ్మకం, లీజు లేదా మరే ఇతర విధంగానూ బదిలీ చేయరాదు, లావాదేవీ జరపరాదు / అన్యాక్రాంతం చేయరాదు.

ప్రదేశం : విశాఖపట్నం, తేది: 16.08.2024 సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్